## క్లుప్తంగా

### నేడు దివ్యాంగులకు కృత్రిమ పాదాల ఏర్పాటు శిబిరం

**పాలకొల్లు సెంట్రల్:** స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి ఆధ్వర్యంలో నేడు దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలు ఎంపిక చేసేందుకు శిబిరం ఏర్పాటు చేయనున్నారు. శనివారం క్లబ్ అధ్యక్షులు కుంపట్ల రామ్‌గోపాల్ మాట్లాడుతూ ఆదివారం స్థానిక రైల్వే గేటు సరస్వతి శిశుమందిర్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. కృత్రిమ అవయవాలు అవసరమైన వారు శిబిరం వద్దకు వచ్చి తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. క్లబ్ సెక్రటరీ తెలనాకుల కిషోర్ గుప్త, ట్రెజరర్ శిరిగినీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఏఎస్ఎన్ఎం కళాశాలలో జాతీయ సేవా దినోత్సవం



జాతీయ సేవా దినోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

**పాలకొల్లు సెంట్రల్:** విద్యార్థుల్లో సేవదృక్పథం కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి అన్నారు. శనివారం అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ సమాజంలో జరిగే సేవా కార్యక్రమాల్లో యువత పాల్గొనాలన్నారు. ఒక్కో కళాశాల విద్యార్థులు ఒక్కో గ్రామాన్ని దత్తతగా తీసుకుని పరిసరాలను పరిశుభ్రం చేయడం వల్ల కలుషితం లేని పరిశుభ్రమైన సమాజాన్ని ప్రజలకు అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యాన యూనివర్సిటీ సందర్శన

**పెనుగొండ:** స్థానిక ఎస్‌వీకేపీ, డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలోని బయాలజీ విద్యార్థులకు వెంకట్రామగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వన విశ్వవిద్యాలయంలో క్షేత్ర పర్యటనతో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు తెలిపారు. శనివారం 54 మంది బయోటెక్నాలజీ , బోటనీ, జువాలజీ, బయోకెమిస్ట్రీ, విద్యార్థులకు క్షేత్ర పర్యటన నిర్వహించినట్లు వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం, తేనేటీగల పెంపకం, అజోల్లా పెంపకం, వర్మీ కంపోస్ట్ తయారీ, మ్యూజియం, పోలీహౌజ్, జంతు పరిశోధన కేంద్రంలు సందర్శించి ఆయా శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించినట్లు తెలిపారు. క్షేత్ర పరిశీలనలో బయోటెక్నాలజీ విభాగాధిపతి టి.రమేష్, బోటనీ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలక్ష్మీ, జువాలజీ విభాగాధిపతి డాక్టర కె.లక్ష్మీ కాంతమ్మ, బయోకెమిస్ట్రీ అధ్యాపకులు టి.దివాకర్‌లు పాల్గొన్నారు.

### బాధితులకు పరామర్శ

**పాలకొల్లు అర్బన్:** రొయ్యల కొనుగోలు విషయంలో తలెత్తిన ఆర్థిక లావాదేవీల విషయంలో ఆత్మహత్యాయత్నం పాల్పడిన బాధితులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శనివారం పరామర్శించారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలోనూ, అలాగే ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గోపి పరామర్శించారు. ఆయన వెంట తిల్లపూడి గ్రామ సర్పంచ్ నడపన శ్రీనివాసరావు ఉన్నారు.

### గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



వడలిలో అవగాహన సదస్సులో గ్రామస్తులకు వర్మి కంపోస్ట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**పెనుగొండ:** గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు అన్నారు. శనివారం వడలిలో స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త, వర్మీ కంపోస్ట్‌పై అవగాహన కల్పించారు. స్వచ్ఛ గ్రామం వలన కలిగే ప్రయోజనాలను ఎంపీడీఓ టి.శ్రీనివాస దొర వివరించారు. అనంతరం వర్మీకంపోస్ట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రెడ్డి గణేష్, చిటికెన దుర్గా భవానీ బాబీలు, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

**వల్లూరులో**

జిల్లా కలెక్టరు పి ప్రశాంతి ఆదేశాలతో డీపీఓ పర్యవేక్షణలో ఆచంట మండలంలో వల్లూరు మోడల్ విలేజ్‌లో తయారు చేసిన వర్మీ కంపోస్ట్‌పై రైతులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. తడిచెత్త పొడి చెత్తలపై అవగాహన కల్పించి ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నేలపూడి బేబీ, డీపీఆర్సీ కో ఆర్డినేటర్ చేతుల మీదుగా రైతులకు వర్మీ కంపోస్ట్‌ను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

# జలజీవన్ వినియోగంలో నరసాపురమే ప్రథమం

చీఫ్ విప్ ప్రసాదరాజు



తూర్పుతాళ్లు తాగునీటి ప్రాజెక్టువద్ద ర్యాపిడ్ వాటర్ ఫిల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

**నరసాపురం రూరల్:** జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా వచ్చే నిధుల వినియోగంలో రాష్ట్రంలోనే నరసాపురం నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో సైపువారి మెరకలో రూ.28.96లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు, బందారుపేటలో రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.21.80 లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. తూర్పుతాళ్లు భారీ రక్షిత తాగునీటి పథకం (సీపీడబ్ల్యూఎస్ స్కీం) వద్ద రూ.2.63కోట్లతో నిర్మించనున్న ర్యాపిడ్ వాటర్ ఫిల్టర్ బెడ్ యూనిట్, సంపు, పైప్‌లైన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలో నియోజకవర్గంలోని 45 గ్రామ పంచాయతీలలలో సుమారు 67 కోట్ల నిధులు మంజూరు చేసుకుని కొత్త పైప్‌లైన్ నిర్మాణంతోపాటు ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ పనులు చేస్తున్నారని వివరించారు. నియోజకవర్గంలో ఉన్న ఆరు సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌ల నిర్వహణ ప్రభుత్వమే భరిస్తుందని ఆయన తెలిపారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకుని మంచినీటి సరఫరాలో ఉన్న లోటుపాట్లను సరిచేసేందుకు ప్రత్యేకంగా సీపీడబ్ల్యూస్ స్కీమ్‌కు సంబంధించి మరమ్మతులు, అభివృద్ధి పనులకు సుమారు 17 కోట్లు నిధులు ఖర్చుచేస్తున్నామని ప్రసాదరాజు తెలిపారు. అనంతరం గ్రామ సంఘాల సమాఖ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రభుత్వం నుంచి అందే ఏ సంక్షేమ పథకమైనా దళారీ వ్యవస్థకు తావులేకుండా నేరుగా లబ్ధిదారునికే అందించే విధానం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారులో మాత్రమే జరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. పెదమైనవానిలంక నుండీ ఎల్బీచర్ల మీదుగా లక్ష్మణేశ్వరం వరకూ రూ.20 కోట్లతో సిమ్మెంటు రోడ్డు నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేశామని ప్రసాదరాజు అన్నారు. కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న, నరసాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కాటన్ పార్కులో విద్యుదీకరణ పనుల పరిశీలన



పార్కులో విద్యుదీకరణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

**నరసాపురం:** పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఉన్న కాటన్‌పార్కులో రూ 23.73 లక్షలతో విద్యుదీకరణ పనులు చేపట్టారు. పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కును ఇటీవల ఆధునికీకరించిన తరువాత పర్యాటకుల సంఖ్య బాగా పెరిగిందన్నారు. పార్కుకు వచ్చే వారికి మరింత ఆహ్లాదం కలిగించే విధంగా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ 23.73 లక్షలు కేటాయించి విద్యుదీకరణ పనులు చేపట్టామని చెప్పారు. పనులు రెండు నెలల్లో ముగిసేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో మిగిలిన పార్కులను కూడా అభివృద్ధి చేసే దిశగా అంచనాలు తయారు చేస్తున్నామన్నారు.

# వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలి



కాంబొట్లపాలెం సర్పంచ్ అనిశెట్టి మల్లిక, నవీన్ దంపతులకు వైఎస్సార్ సీపీ జెండా కప్పి అభినందిస్తున్న గుడాల గోపి

**యలమంచిలి:** పార్టీ గెలుపే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా పని చేయాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. మండలంలోని పెదలంక, కనకాయలంక గ్రామాలలో శనివారం ఆయన పర్యటించారు. కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. రెండు గ్రామాలలో పాఠశాలలకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. కార్యకర్తలతో కలసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కనకాయలంకకు లైన్‌మెన్ కావాలని, రోడ్లు వేయాలని, ఖాళీగా ఉన్న సచివాలయ సిబ్బంది నియమించాలని సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు కోరారు. ఆయన వెంట సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ (బుజ్జి) పులి గోపాలం, వలవల నరసింహమూర్తి, వలవల ప్రసాద్, పులి సుబ్రహ్మణ్యంత నెల్లి ఆనందరావు, గుడిశే శివాజీ, పులి కాశి, చిట్టిమేను ప్రసాద్, దీపాటి ప్రకాష్, ఉచ్చుల పిలిప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

**కాంబొట్లపాలెంలో ఒక్కటైన నాయకులు**

రెండున్నరేళ్ల క్రితం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంబొట్లపాలెం సర్పంచ్‌గా అనిశెట్టి మల్లిక ఎన్నికయ్యారు. ఆ సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన శీలం చంద్రకళ ఓటమిపాలయ్యారు. దీంతో అప్పటి నుంచి గ్రామంలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఈ సమస్యపై వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), పార్టీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు శనివారం స్పందించి గ్రామంలో రెండు వర్గాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇరు వర్గాలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న నేపథ్యంలో గ్రామంలో పార్టీ మరింత పటిష్టం కావాలంటే ఇరు వర్గాలు కలసి సమిష్టిగా పని చేయాలని గోపి కోరారు. పార్టీ ఎవరికి ఇచ్చే ప్రాధాన్యత వారికి ఇస్తుందని ఆయన చెప్పారు. దీంతో ఇరు వర్గాలు కలసి పని చేయడానికి ఒప్పుకోవడంతో నాయకులంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సర్పంచ్ అనిశెట్టి మల్లిక, నవీన్ దంపతులకు వార్డు సభ్యురాలు ఎల్ల లక్ష్మికి వైఎస్సార్ సీపీ జెండా కప్పి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీప మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ నాయకులు ఉచ్చుల స్టాలిన్, బొంతు వెంకట కర్ణా రెడ్డి, మంద హరికుమార్, శీలం వీరబాబు, అనిశెట్టి ధర్మారావు, గంటి మదన విజయుడు, బొక్కా వెంకటేశ్వరరావు, అనిశెట్టి మోహనరావు, బోనం బులి వెంకన్న, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, దొంగ విజయ్‌కుమార్, వలవల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పోడూరు: గుమ్మలూరు గ్రామంలో పోషణ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



యలమంచిలి: శిరగాలపల్లిలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి బి.వెంకటరమణ

**పోడూరు:** బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మావతి అన్నారు. గుమ్మలూరు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆధ్వర్యంలో 'పోషణ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, పౌష్టికాహార ప్రదర్శన, కిశోరబాలికలకు, గర్భిణీలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ నాగపద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఆరోగ్యపరంగా అనేక సమస్యలు కూడా ఎదురవుతాయన్నారు. కిశోర బాలికలు ప్రతీరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామసర్పంచ్ గొట్టుముక్కల సోనియారమేష్, ఎంపీటీసీ సభ్యులు పోతాబత్తుల లక్ష్మీదుర్గ, అంబటి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

**యలమంచిలిలో..**

**యలమంచిలి:** బాలికల ఆరోగ్యానికి బాల్య వివాహాలు అనర్థం చేస్తాయని మండల ప్రత్యేక అధికారి, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వెంకటరమణ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా శనివారం శిరగాలపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, గృహ నిర్మాణ శాఖ డీఈ రామాయణం త్రిమూర్తులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీన, హైస్కూల్ హెచ్‌ఎం ఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

**పెనుమంట్రలో..**

**పెనుమంట్ర:** తల్లీబిడ్డలు ఆరోగ్యంగా జీవించాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా స్త్రీశిశుసంక్షేమ శాఖ ద్వారా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి(వాసు) అన్నారు. గ్రామసర్పంచ్ తాడిపర్తి ప్రియాంక అధ్యక్షతన పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం పోషకాహార మాసోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసురెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీలో చదువుతున్న పిల్లలందరికీ ఐరన్ సిరప్స్‌తో పాటు విటమిన్ ట్యాబెలెట్లు ఉచితంగా అందజేస్తామని అదే విధంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో తల్లులతో పాటు సిబ్బంది కూడా వినియోగించుకునేందుకు అవసరమైన ఫర్నీచర్‌ను కూడా ఉచితంగా అందజేస్తామని సభలో ప్రకటించారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తయారు చేసి తీసుకువచ్చిన పౌష్టికాహార వంటకాలను ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పొట్లాడ పద్మజ, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి అంగర కృష్ణకుమారి, సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లు ఎస్.వెంకటలక్ష్మి, జి.సుజాత, కె నాగలక్ష్మి, ఎం.విజయకుమారి, టి.పోసమ్మ తదితరులు పాల్గొన్నారు.

**మొగల్తూరులో..**

**మొగల్తూరు:** ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పడవల మేరీ కోరారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక సత్రవుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా సులువుగా పౌష్టికాహారం తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

### నేడు 5వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

**నరసాపురం:** పట్టణంలోని 5వ వార్డులో ఆదివారం ఉదయం 6 గంటలు నుంచి గడపగడపకు మన ప్రభుత్వం రెండో విడత కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ అవసరం



కోర్టు సిబ్బందికి వైద పరీక్షలు నిర్వహిస్తోన్న దృశ్యం

**నరసాపురం:** ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ సూచించారు. శనివారం కోర్టు వద్ద మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బందికి ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు బీపీ, షుగర్, కొన్నిరకాల రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన జడ్జి విజయదుర్గ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అనారోగ్య సమస్యలు ప్రతీ ఒక్కరినీ వేధిస్తున్నాయని పేర్కొన్నారు. పని ఒత్తిడితో కూడా ఆరోగ్య సమస్యలే ఏర్పడుతున్నాయని చెప్పారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే చికిత్స తీసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు వై.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, వైద్యులు కె.రామకృష్ణ, పి.రామారావు, పి.సోనియా, కె.రమేష్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఆయుష్మాన్‌భవ పేదలకు వరం



కొడమంచిలిలో ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**పెనుగొండ:** దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భవ పథకంగా పేదల పాలిట వరమని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. శనివారం కొడమంచిలి పంచాయతీ వద్ద లబ్ధిదారులకు ఆయుష్మాన్ భవ కార్డులను పంపిణీ చేశారు. ఆయుష్మాన్ భవ కార్డుతో రూ.5 లక్షల వరకూ ఉచితంగా చికిత్స చేస్తారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రూపాంజలి, ఏఎన్ఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# గణనాయకాయ..గణాధ్యక్షాయ..



మొగల్తూరు: ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి పూజలు చేస్తున్న డ్రైవర్లు



పోడూరు: జిన్నూరు నరసింహారావుపేటలో వినాయకుడికి లక్ష గరికపూజ నిర్వహిస్తున్న భక్తులు



నరసాపురం రూరల్:చిట్టవరంలో పూజలు చేస్తున్న భక్తులు

**యలమంచిలి:** వినాయకచవితి నవరాత్రి వేడుకలను గ్రామాలలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ప్రతి గ్రామంలోను ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు వేసి ఏర్పాటుచేసిన వినాయకుని ప్రతిమల వద్ద ఉదయం, రాత్రి పూటల్లో పూజలు చేస్తున్నారు. పూజల అనంతరం రాత్రి సమయంలో వినాయక పందిరి వద్ద తాళాల భజన చేస్తున్నారు.

**మొగల్తూరులో..**

**మొగల్తూరు:** గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. పేరుపాలెం, కాళీపట్నం, ముత్యాలపల్లి, రామన్నపాలెం గ్రామాలతో పాటు మొగల్తూరులోని ముక్కువారి వీధి, కమ్మరికొలం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకున్ని గ్రామంలోని పలు వీదుల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు.స్థానిక గాంధీ బొమ్మల సెంటర్లో ఏర్పాటు చేసిన వినాయకునికి ఆటోడ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నరసాపురంలో..**

**నరసాపురం రూరల్:** గణపతి నవరాత్రుల ఉత్సవాలు ఆరవ రోజుకు చేరుకున్నాయి. విఘ్నేశ్వరుడి నిమజ్జనోత్సవాలు పురస్కరించుకుని తూర్పుతాళ్లు కరింశెట్టిపాలెం, వేములదీవి, సారవ, రుస్తుంబాద, కొప్పర్రు, లిఖితపూడి, ఎల్బీచర్ల, తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్టవరం గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నూతన దంపతులు నరహరిశెట్టి అరవిందకృష్ణ, హిమవర్షిణి దంపతులు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గ్రంధి వనజ, శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పాలకొల్లులో..**

**పాలకొల్లు సెంట్రల్:** గణపతి నవరాత్రుల సందర్భంగా ఉత్సవాలు ఆరో రోజుకు చేరుకున్నాయి. పలు కూడళ్లలో నిలబెట్టిన గణపతులకు ఉదయం, సాయంత్రం భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గణపతులను శనివారం నిమజ్జనం చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్ స్నేహ ఆటో యూనియన్ 2 ఆధ్వర్యంలో గణపతి నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అలాగే స్థానిక బుధవారపు వీది సెంటర్ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద మహిళలు విష్ణు పారాయణ చేశారు.

**పోడూరులో..**

**పోడూరు:** జిన్నూరు నరసింహారావుపేటలో గణపతి నవరాత్రుల వేడుక ను స్థానిక నవ యువత యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం వినాయకునికి లక్ష గరికపూజ, విశేషపూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా మంగళవారం నిమ్మజ్జనోత్సవం, అక్టోబర్ 2న అన్నసంతర్పణ నిర్వహించనున్నారు.

**పెనుగొండలో...**

**పెనుగొండ:** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సిద్ధాంతం తానేష్ పాలెం శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం గణపతి ప్రతిమకు పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో బాణసంచా కాల్పులతో, మేళతాళాలతో ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం సిద్ధాంతం కేదారీఘాట్ వద్ద నిమజ్జనం నిర్వహించారు.

# ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**మొగల్తూరు:** ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి ఆదేశించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మండలంలోని పేరుపాలెం నార్త్ అంబేడ్కర్ కాలనీలో పర్యటించారు. అంబేడ్కర్ కాలనీలో సుమారు 48 ఇళ్ళు మంజూరుకాగా కేవలం 8 మాత్రమే పూర్తియ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని వాటిని కూడా అనుకున్న సమయానికి పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంకుడు గుంతలను పరిశీలించి ఇంకుడు గుంతలకు అదనంగా రూ.6వేలు అందిస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు వివరించాలన్నారు. ఆమె వెంట హౌసింగ్ డీఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ ఫణీంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.



అంబేద్కర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న మండల పరిషత్ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి